# టీ కప్పులో కల్లోలం

పై అధికారులను గురించి క్రింది ఉద్యోగులు ఫిర్యాదు చెయ్యడం సర్వత్రా ఉన్నదేనని మీరు భావించవచ్చు. ఒకటి రెండు సంఘటనలు ఏకరువు పెడితేగానీ మీకు నా వాదంలోని పసదనం బోధపడదని నాకు తెలుసు. ఉదాహరణకు అలిమేలు మంగమ్మ విషయమే తీసుకోండి! ఇందులో నా పొరబాటేమైనా వుంటే మీరే చెప్పండి...

అలిమేలు మంగమ్మంటే ఆవిడ గూడా మా హెడ్‌మిస్ట్రెస్ విమలాదేవిలాగా, మా శ్రీమతి రాజేశ్వరిలాగా ఒక మామూలు ఆడమనిషే ననుకునేరు! కాదు. కానేకాదు. శేషాద్రి శిఖరాలపైన తెనుగువారి యిష్టదైవమై వెలుగొందుతున్న శ్రీనివాసమూర్తి వున్నాడుగదా, సాక్షాత్తుగా ఆయనగారి యిల్లాలే ఈ అలిమేలు మంగమ్మ! క్షమించాలి. ఈ కథలో ఆమెనుగూడా ఒక పాత్రగా ప్రవేశపెట్టబోవడంలేదు. మా బడిలో ఒక ప్రేయర్ హాలుంది. అందులో గోడలపైన దండిగా జాతీయ నాయకుల చిత్రపటాలున్నాయి. మధ్యలో ద్వారబంధానికి ఎగువగా రెండు పెద్ద పెద్ద పటాలు ఒక జంటగా అమరివుండేవి. అందులో ఒక పటంలోనేమో వేంకటేశ్వరుడు, రెండో పటంలో నేమో అలిమేలు మంగతాయారు. బడికంతా ఒక పెద్ద దిక్కులాగా ఆ పురాణ దంపతులక్కడ వాళ్ళపాటుకు వాళ్ళు నెలకొని వుండేవారు. ఈలోగా ఏం జరిగిందంటే, మా బడిలోని మూషిక రాజాలకు బొత్తిగా తిండి కరువొచ్చిపడింది. ఇది పనికొచ్చేది, యిది పనికిరానిది అన్న విచక్షణ లేకుండా అవి ప్రతి కాగితాన్నీ అప్పళంలా ఆహరించడం ప్రారంభించేసరికి, మా జాగ్రత్తలో మేముండి పుస్తకాలు, పత్రికలు మొదలైన వాటిని పెట్టెల్లోనూ, బీరువాల్లోనూ పెట్టి తాళం వేసుకోసాగాము. క్రుద్ధ మూషికాలు కాగితాల తరువాత తినదగిన వస్తువుల కోసం పరిశోధన కొనసాగించాయి. ఈ పరిశోధనలో ఒక చిట్టెలుకకు గోడకూ, పటానికీ లంకెగా కట్టివున్న త్రాడుగూడా ఒక ఖాద్య పదార్థంలాగే గోచరించింది. ఈ అవాంతరకృత్యంవల్ల ఒకనాడు అలిమేలు మంగమ్మ పటం గబుక్కున నేలపైన పడిపోయింది.

అద్దం ముక్క ముక్కలైపోయిందని వేరుగా చెప్పనవసరం లేదు గదా! బాగు చేయించి మళ్ళీ దాన్ని యథాస్థానంలో పెట్టవలసిందిపోయి, హెడ్‌మిస్ట్రెస్ విమలాదేవి పటాన్ని తీయించి లైబ్రరీలో బీరువాల వెనుక పెట్టించింది.

"పటానికి అద్దం వేయించరా మేడమ్?" అని ప్రశ్నించాను.

"ఇప్పుడేం తొందరొచ్చిందిలెండి! నిదానంగా ఆలోచిద్దాం..."

"అదేం మాట! భార్యాభర్తలిద్దరూ కలిసి వుండడమే న్యాయం. లోకం హర్షించేదిన్నీ, సమాజానికి శ్రేయస్కరమైనదిన్నీ అదే! ఎటొచ్చీ వాళ్ళను విడదీయడమే మహాపాపం!"

"పోనీ ఒక పనిచేద్దామా మేడమ్! పిల్లల దగ్గర చందాలు వసూలు చేద్దాం..."

"మిస్టర్ మూర్తీ! సర్వీసుకు మీరు కొత్తవాళ్ళేమీకాదు. ఎనిమిదేళ్ళుగా యిదే స్కూల్లో పనిచేస్తున్నారు. రూల్సు, రెగ్యులేషన్స్ మీకు తెలిసినవే. ఐనా ఉండుండి తలకుమించిన

పనిచేసి నా గొంతుమీది కెందుకు తెస్తారో నాకు తెలియకుండా వుంది. అదికాదండీ, చీటికీ మాటికీ మీరు పిల్లల దగ్గర డబ్బులు వసూలు చేస్తారా? వాళ్ళు యిళ్ళకు వెళ్ళి డబ్బులకోసం పీడిస్తే, పేరంట్స్ పైవాళ్ళకు అర్జీలు పెడితే, వాళ్ళు ఛార్జస్ ఫ్రేమ్‌చేస్తే ఎక్స్‌ప్లనేషన్ వ్రాయలేక చచ్చేది నేనేగదా!"

హెడ్ మిస్ట్రెస్‌గారికి యింతఘాటుగా కోపం రావలసిన అవసరమేమిటో నాకు స్ఫురించలేదు.

విమలాదేవి మా బడికి బదిలీ అయి రావడం ఏడెనిమిది నెలల నాటి మాట. ఆమెకు ఎప్పుడు, ఎందుకు, ఎవరిపైన కోపం వస్తుందో, దాన్ని ఆవిడ ఎలా ఆవిష్కరిస్తుందో తెలుసుకోడం యింతవరకూ నాచేతగాలేదు.

నెలరోజుల క్రితం వరకు గుడ్డిలో మెల్లగా పరిస్థితి ఒక రకంగా వుండేది. ఇటీవల ఒక సరిక్రొత్త పరిణామం పుట్టుకొచ్చింది. ఎందుచేతనో హెడ్‌మిస్ట్రెస్ గారికి ముంగరవారి వీధిలో తాను కాపురమున్న యిల్లు నచ్చలేదు. వేరొక అద్దె యిల్లుకోసం అన్వేషణ జరుగుతోందని విన్నాను. పులిమీద పుట్రలాగా మా వీధిలోనే ఒక యిల్లు కుదిరింది. అక్కడికి రావడంతో, వచ్చిన కొత్తలోనే మా హెడ్‌మిస్ట్రెస్ గారికిన్నీ మా శ్రీమతికిన్నీ పరిచయం ఏర్పడింది. అంతటితో గృహ జీవితంలో గూడా నాకు మనశ్శాంతి కరువైపోయే ప్రమాదం పొడచూపింది.

ఎలాగంటారా? అదే చెబుతున్నాను.

❀ ❀ ❀ ❀

ఒకనాటి సాయంకాలం నేనింటికి వెళ్ళేసరికి గంట ఏడయింది.

"ఎలాగైనా మీరు మంచివాళ్ళు. బడి వదిలిపెడితే నేరుగా యింటికే వచ్చేస్తారు." అంది రాజేశ్వరి! "ఈరోజు కొంచెం ఆలస్యమైందిలే రాజేశ్వరీ!" అన్నాను.

"ఆలస్యం కావడం తప్పనిగాదు. కానీ ఒకరోజు నేను సినిమాకు వెళ్ళి ఒకటి రెండు గంటలు ఆలస్యంగా వస్తాననుకోండి! అప్పుడు మీరూరుకుంటారా అనే నేనడగడం?"

నిస్సందేహంగా యిది కొత్త ధోరణి. అందువల్ల గూఢార్థాలకు, దురర్థాలకు తావివ్వకుండా ఆచితూచి మాట్లాడదలచుకున్నాను. "కారణం లేనిదే ఆలస్యం జరుగుతుందా? ఆలస్యంగా రావడమనేది నీ విషయంలో గూడా ఎప్పుడైనా జరగొచ్చు నేనేమీ కోప్పడను..."

"మంచిది! ఒక విషయంపైన మనకు పరిష్కారం కుదిరింది. రెండోది: తెల్లవారుతున్నప్పుడు మీరు పడుకునే వుంటారు. నేను లేచి కాఫీ చేసి తీసుకొస్తే గానీ లేవరు. ఎందుకమ్మా! ఇక మీదట ఒక రోజు నేను లేచి కాఫీ చేస్తే, యింకోరోజు మీరు చేసి తీసుకరావాలి..."

"ఒప్పుకున్నాను. రేపటి ఉదయం వంతు నాదే!"

"ఇకపోతే సంసారంలో భార్యాభర్తలిద్దరూ సమానమే గదండీ! బండికి చక్రాలెలాగో, మనిషికి కళ్ళెలాగో, సంసారంలో భార్యాభర్తలలాగనీ మీరు వినలేదా? మరైతే నేను మిమ్మల్ని 'మీరు' అంటాను గదా, మీరు మాత్రం నన్ను 'నువ్వు' అని వ్యవహరించడం దేనికి?"

"ప్చ్ ప్చ్, ఎంత పొరబాటు జరిగిపోయిందో చూచారా రాజేశ్వరి గారూ! మన్నించాలి. ఇకపైన నేను మిమ్మల్ని 'మీరు' అనే వ్యవహరిస్తాను. చాలకపోతే 'తమరు' అనిగూడా అంటాను. కానీ ఒక సందేహమండీ! ఈ బుద్ధి మీ అంతట మీకే పుట్టిందా, లేకుంటే ఇతరులెవరైనా బోధించారా?"

తెచ్చిపెట్టుకున్న నిగ్రహం పటాపంచలు కాగా రాజేశ్వరి పక్కున నవ్వేసింది. "బాబ్బాబూ! మీకు పుణ్యముంటుంది. చిన్నదాన్ని, నన్ను పట్టుకుని మీరు 'అండీ' అనీ, 'మీరు' అనీ మాట్లాడడమేమిటండీ, ఖర్మ. మీకు తెలిసి వుండడం ఎందుకైనా మంచిదని పాఠం అలాగే ఒప్పచెప్పాను. ఇదంతా మీ హెడ్‌మిస్ట్రెస్ గారి గీతోపదేశం".

"అయ్యోపాపం! ఆవిడ ఉపదేశం బూడిదలో పోసిన పన్నీరు కావలసిందేనా రాజేశ్వరీ! నువ్వు నాతో పోరాటాన్ని ప్రారంభించవా?" అన్నాను.

"ఊరుకోండి బాబూ! నాకిప్పుడెంతో హాయిగా వుంది. మీరు కొత్తగా నాకు హక్కులిచ్చినంత పుణ్యం. మీతో పోట్లాట పెట్టుకున్నానంటే నాకు మతిపోతుంది..."

ఇంకా నయం. రాజేశ్వరికైతే మతిపోతుంది. ఇల్లుగూడా పదిలంగా వుండదు గనుక నాకప్పుడిక గోదారే శరణ్యం.

పనులన్నీ పూర్తిచేసుకుని రాజేశ్వరి మళ్ళీ ఓ అరగంట సేపటికి హాల్లోకి వచ్చింది. చలనం లేకుండా వాలు కుర్చీలో పడుకున్న నావైపు చూస్తూ తెల్లబోయి "నిజంగానే మన యింట్లో పోరాటం ప్రారంభమైపోయినట్లు అలా నిర్ఘాంతపడిపోయి కూచున్నారేమండీ?" అంటూ పలకరించింది.

"కాదు రాజేశ్వరీ. నువ్వు హక్కుల పోరాటం ప్రారంభిస్తావు. నేను నిరాకరిస్తాను! నువ్వు తిరుగుబాటు చేస్తావు. ఇల్లు రణరంగంలా మారిపోతుంది. ఈ పరిణామంవల్ల ఒక వ్యక్తికి ఆనందం కలిగేటట్టు ఉంటే మనమెందుకలా చేయగూడదు?"

అనుమానంగా నావైపు చూడసాగింది రాజేశ్వరి.

పదిరోజులు తర్వాత ఓనాటి ఉదయం నేను తోటలో రావిచెట్టు క్రింద కూర్చుని వుండగా హెడ్‌మిస్ట్రెస్ గారినుంచి పిలుపు వచ్చింది.

"మూర్తిగారూ! రావిచెట్టు క్రింద కూచున్నారేమండీ! క్లాసు లేదా?"

లేదన్నాను.

"నేనూ గమనిస్తున్నాననుకోండి! మునుపటిలా మీరు ఉత్సాహంగా లేరు. అనారోగ్యంగా వుంటే సెలవు పెట్టి ట్రీట్‌మెంటు యిప్పించుకోగూడదూ?"

"ఎందుకులెండి మేడమ్! సెలవు పెట్టి యింటి దగ్గర కూచుంటే అనారోగ్యం మరింత ఎక్కువయ్యేటట్టుంది. అది యిల్లుగాదు, అడవి. రగడలేని రోజులేదు. స్కూల్లో వున్నంత వరకే నా మనసుకు శాంతి. ఇంటికి వెళ్ళడమంటే భయమై పోయింది. ఐనా ఈ బాధలు మీకేమర్థమౌతాయి లెండి మేడమ్. ఇలాంటి బాదరబందీ లేవీ మీకు లేవు..."

హెడ్‌మిస్ట్రెస్ గారి ముఖం విరిసిన శతపత్రమై పోయింది... ప్రసక్తి వచ్చింది గనుక చెప్పాలనిపిస్తోంది. గృహమే కదా స్వర్గసీమ అని వింటుంటాం. ఊరికే ఎలా తయారౌతుంది. అలా మలచుకోవాలి. సాయంకాలం యింటికి వెళ్తాను. ఎక్కడి వస్తువక్కడ యిల్లంతా శుభ్రంగా వుంటుంది. మాట్లాడ్డానికి ఎవరో యిరుగు పొరుగు ఆడవాళ్ళు

వచ్చి పోతుంటారు. కాలం హాయిగా గడిచిపోతుంది. భోజనం చేసి పడుకోడమే ఆలస్యం. గాఢనిద్ర! లేవండమ్మగారూ, కాఫీ తయారైంది అంటుంది వంటలక్క. లేచి పేపరు చూస్తుంటాను. టిఫిను సిద్ధం! స్నానం చేస్తాను. డ్రెస్ చేసుకుంటాను. బడికి హాజరైపోతాను. చింతలనీ, వంతలనీ అందరూ అంటుంటే వినడమే. వాటి రంగూ రుచీ ఎలా వుంటుందో గూడా నాకు తెలియదు..."

"తీరిక సమయాల్లో మీరు పుస్తకాలు చదవడం గానీ, సినిమాలకు వెళ్ళడంగానీ వుండదా మేడమ్?" వీలయినంత సిన్సియర్‌గానే ప్రశ్నించాను.

"అబ్బే, అవంటేనే నాకు రోత. వాటిని 'హేట్' చేస్తాననుకోండి. ఎంతసేపైనా ఒక మగవాడున్నూ, ఒక ఆడమనిషిన్నీ! లేదంటే రెండు మూడు జంటలు ఒకరివెంట ఒకరు, పరిచయాలు, ప్రేమలు, వియోగాలు, విరహాలు, అసూయలు, అనుమానాలు వట్టి చెత్త. సారహీనమైన గొడవ గదండీ! నాకేం నచ్చదు."

"అదృష్టమంటే మీదే మేడమ్. నిండైన ఆనందం మీ సొత్తు. నాకా ప్రాప్తం లేదు" అంటూ వేడిగా నిట్టూర్చాను.

కొన్ని కొన్ని దేవతలను సంతృప్తి పరచడంకోసం ఎన్నెన్నో చేయరాని పనులు చేయడం లేదా? ఆ దేవతలతో పోల్చి చూస్తే మా హెడ్‌మిస్ట్రెస్ విమలాదేవి ఎంతో మేలు. ఈవిడకు కొన్ని అబద్ధాల మూలంగా మేరు పర్వంతమంత ఆనందం కలుగుతుంది. అబద్ధాల పునాదులపైన ఆమె ఒక కృత్రిమమైన ఆనంద సౌధం నిర్మించుకోడంలో నాచేతనైన సహాయం నేనూ చేస్తున్నాను తప్పేముంది?

కానీ నాకున్నంత నిదానం, ఉపకార చింతన (నటనాపటిమ అనుకోండి పోనీ) మా ఆవిడకు లేకపోయింది. ఎంతో ప్రయత్నంమీద ఆమె ఒక నెలరోజులు మాత్రం నేను నియమించిన హద్దుల్లో వుండగలిగింది. ఆనెల రోజుల్లోగూడా ప్రతి దినమూ ఒక కంప్లెయింటే! మగవాడు స్త్రీకి తీరని అన్యాయం చేశాడు. భోగవస్తువుగా వాడుకున్నాడు. ఇంధనంగానే ఉపయోగించుకుంటూ వచ్చాడు. స్థూలంగా యిది హెడ్‌మిస్ట్రెస్ విమలాదేవి వాదం. అక్కడికక్కడ ఆ వాదానికి తలవూపి, యింటికి రాగానే నాతో తలపడేది రాజేశ్వరి.

"ఏమండీ మగవాళ్ళందరూ అలాంటి దుర్మార్గులే నంటారా?"

"కొందరు మంచివాళ్ళుగూడా వుండవచ్చు..."

"మరైతే ఆడవాళ్ళలో మాత్రం చెడ్డవాళ్ళు లేరా?"

"చెప్పలేం. వాళ్ళలో గూడా కొందరు చెడ్డవాళ్ళు వుండొచ్చు..."

"అలాగైతే మీ హెడ్‌మిస్ట్రెస్ గారు మగవాళ్ళపైన అలా విరుచుకు పడిపోతుందెందుకండి?"

"ఏమో ఆవిడనే అడగరాదా?"

"అడిగేదాన్నే! మీరెక్కడ బాబూ, నా నోటికి బుట్టి పెట్టేసేరు..."

తాత్కాలికంగా మౌనం. మళ్ళీ మొదలు

"ఏమండీ! పెళ్ళి అనేది తప్పా?"

"కాదే."

"మరైతే అదేదో వట్టి పనికిమాలిన పనైనట్టు ఆవిడ అలా తీసిపారేస్తుందెందుకండీ?"

"రాజేశ్వరీ, ఎవరిపిచ్చి వాళ్ళకానందం! నీకెందుకు? నువ్వూరుకో"

"ఏం వూరుకోడమో బాబూ! ఎందుకొచ్చిన పీడ, నేనక్కడికి వెళ్ళనే వెళ్ళను..."

కానీ హెచ్.యం.విమలాదేవి ఈవిడ కంపెనీకోసం తహతహలాడిపోతున్నట్టుగా ప్రతిరోజూ రమ్మని కబురు పెట్టేది. రాజేశ్వరికి వెళ్ళక తప్పేది గాదు.

ఇలా మరికొన్ని రోజులు గడిచాయి.

చివరకు నేనేదైతే జరుగుతుందని భయపడుతూ వచ్చానో, అది కాస్త జరగనే జరిగింది.

ఒకనాటి సాయంకాలం నేను షికారుకు వెళ్ళి తిరిగి వచ్చేసరికి రాజేశ్వరి ఎదురుగా వచ్చి "అయ్యా, మీ హెడ్‌మిస్ట్రెస్‌గారితో స్నేహానికి తెగతెంపులు" అంటూ ప్రకటన జారీ చేసింది.

"ఎందుకు రాజేశ్వరీ, ఏం జరిగింది?" కంగారుగా ప్రశ్నించాను.

"ఆవిడ గొప్పల్ని ఎంతకాలమని సహించగలం? నాచేత గాలేదు. మొదట నాకెన్ని చీరలున్నాయో అడిగి తెలుసుకుని, ఆ తరువాత లోపలికి తీసుకెళ్ళి బీరువా తెరిచింది. అందులో నాలుగైదు అరలనిండా చీరలే వున్నాయిలెండి, ఒక చిన్న షాపులాగా! ఒక్కొక్క చీరనే పైకి తీయడం, అంచు, పైట చెరగు, నేత దేనికది విడివిడిగా చూపించడం, ఆ చీర ఎక్కడ కొనిందీ, ఎంతకు కొనిందీ వివరించడం యిలా ఒక ప్రదర్శనమే మొదలైంది. ఈ సత్కథా కాలక్షేపం ఒక గంటసేపు కొనసాగిన తర్వాత నేనుండబట్టలేక ఒక మాటనేశాను..."

"చెప్పు రాజేశ్వరీ ఏమన్నావు?"

"చీరలన్నీ చాలా బాగున్నాయండీ! కానీ ఏం లాభం? కట్టుకుంటే... చూచి ఆనందించడానికి ఎవరూ లేరు గదా అనేశాను..."

నేను హతాశుడినై కుర్చీలో కూలబడిపోయాను.

రాజేశ్వరికి మాత్రం చీమకుట్టినట్టయినా లేదు? ఆమె తనంతట తాను చెప్పుకపోతుంది. "అమ్మగారి ముఖం అప్పుడు చూడాలి! కళ్ళల్లో కన్నీళ్ళు, చూపుల్లో కోపాలు, ఉడుకుమోత్తనంతో బుసలు కొట్టిందనుకోండి! పైనబడి నా ఒళ్ళంతా రక్కేస్తుందేమోననుకున్నాను. అంతపని జరగకముందే పరుగెత్తుకొచ్చేశాను..."

'యుద్ధానంతర ప్రశాంతి' అంటారు గదా! మాకు హెడ్‌మిస్ట్రెస్ గారికి మధ్య అలాంటి ప్రశాంతి నెలకొన్నట్టయింది. బడిలోనైతే ఒకరి ముఖం ఒకరు చూచుకోడం తప్పడం లేదు కానీ మాటలు బాగా తగ్గిపోయాయి. ఆఫీసు రూంలో సంచలనమే లేదు. హెడ్‌మిస్ట్రెస్‌గారి వైఖరి చూస్తుంటే ఆమె బడికి బయల్దేరి వస్తున్నట్టులేదు. ఏదో సంతాప సభకు వచ్చి వెళ్తున్నట్టు వుంది. ప్యూను నరసయ్య ద్వారా మరికొన్ని వర్తమానాలుగూడా తెలియసాగాయి. ఎన్నడూ లేనిది ఈ మధ్య అతడు "అమ్మగారూ మీకు క్లాసుంది" అంటూ జ్ఞాపకం చేయవలసి వచ్చిందట. ఒకసారి అలా చెప్పడానికి వెళ్ళగా ఆమె విస్తుపోతూ "ఎక్కడిది? నాకిప్పుడు క్లాసు లేదు" అంటూ టైమ్‌టేబిల్ చూచిందట. "అమ్మగారూ ఇప్పుడు జరుగుతున్నది ఉదయం కాదండీ, సాయంకాలం" అంటూ నరసయ్య పొరబాటును గుర్తుకు తెచ్చేసరికి ఆమె ముఖం వెలవెల పోయిందట. "ఇదేం విడ్డూరమండీ

బాబూగారూ బడి వదలి పెట్టినా ఈమెకు యింటికి వెళ్ళాలన్న ధ్యాస లేదే! పొద్దుపోయి దీపాలు వెలిగినా కుర్చీలో బొమ్మలా కూచుండిపోతుంది. 'అమ్మగారూ ఇంటికెళ్ళరా' అని అడిగితే ఇంటికా నరసయ్యా! ఎళ్ళాలి. నడిచే ఓపిక లేదు. ఓ రిక్షా తెచ్చి పెట్టు బాబూ' అంటుంది. బాబుగారూ! ఈవిడేమైనా ముసలిదా ముతకదా? మోడులా అలా వుండి పోయిందెందుకండీ?" అంటూ నరసయ్య వాపోయాడు.

జీవితం ఒక సువర్ణ కలశం. కాలపురుషుడు వంతువారీగా అందులో అమృతం కురిపిస్తాడు, సకాలంలో నువ్వు వెళ్ళవు, ఏమౌతుంది? నీ కలశం ఖాళీగా వుండిపోతుంది.

నీడలా వచ్చి, నిశ్శబ్దంగా మసలుకుంటూ, నీరసంగా యింటికి వెళ్ళిపోతూ వచ్చిన హెడ్‌మిస్ట్రెస్ విమలాదేవి ఒకానొక సోమవారంనాటి వుదయం తనకు మారుగా బడికి సెలవు చీటీ పంపింది.

"జొరమంటే జొరం కాదండీ బాబుగారూ! నిన్నటి దినమంతా మూసిన కన్ను తెరవలేదు" అన్నాడు నరసయ్య

ఆరోజు సాయంకాలం వీలయినంత తొందరగా యింటికి వెళ్ళాను. త్వరగా తెమలమనేసరికి సినిమా ప్రోగ్రాం కాబోలుననుకుని మా ఆవిడ పరవశించిపోయింది. హెడ్‌మిస్ట్రెస్‌గారి యింటి కనేసరికి ఆవిడ ముఖం చింతాకంతైపోయింది.

"నే(న్రా)ను. అంతగా అవసరమైతే మీరు వెళ్ళండి" అంటూ మంకుపట్టు పట్టింది.

"కాదులే రాజేశ్వరీ. మనం మానవులం. రాతి బొమ్మలం కాము. కష్ట సమయాల్లో తోటి మనుషులను ఆదుకోలేకపోతే యిక మానవుల మనిపించుకోడానికి ఎలా పనికొస్తాం..."

"చెప్పండి బాబూ చెప్పండి. పరోపకారమే పరమధర్మమనండి. మానవ సేవే మాధవ సేవ అనండి. టీచర్లు గదా, మీకు తెలియని నీతులా?"

కానీ ఏ మాట కామాటే చెప్పుకోవాలి. మనసు నవనీతం, పలుకు వజ్రాయుధం అంటారే, ఆ మాట కొంతవరకూ ఆడవాళ్ళ విషయంలో గూడా నిజమేనేమో అనిపిస్తుంది. తీరా హెడ్‌మిస్ట్రెస్‌గారి యింటికి వెళ్ళి ఆమె పరిస్థితిని కళ్ళజూచిన తరువాత రాజేశ్వరి విలవిలలాడిపోయింది. పడక సర్దింది. దుప్పటి సరిగ్గా కప్పింది. పేషంటు తలను తన ఒడిలోకి తీసుకొని నెమ్మదిగా కాఫీ త్రాగించింది. "అది కాదండీ! జ్వరం యింత ముమ్మరంగా కాస్తోందిగదా! మాకొక మాట చెప్పి పంపకూడదా? మీకంత కాని వాళ్ళమై పోయామా మేము" అంటూ మనసుకెంతో నొచ్చుకుంది.

"చెప్పి పంపకపోయినా మీరొస్తారని నాకు తెలుసు" సజల నయనాలలోనుంచి రాజేశ్వరివైపు చూస్తూ అంది విమలాదేవి.

అప్పటికి నేనొకణ్ణి అక్కడే వున్నట్టు రాజేశ్వరికి గుర్తుకొచ్చింది. "అదేమిటండీ అలా నిల్చుండిపోయారు? వెళ్ళండి, పరుగెత్తండి. డాక్టరు సూర్యనారాయణ గారిని తీసుకురండి. ఇక్కడున్నట్టుగా రావాలి మరి..."

అరగంట సేపట్లో నేను డాక్టరు సూర్యనారాయణగారిని రంగంపైన ప్రవేశపెట్టాను. రోగిని పరీక్షించి, రోగనిర్ధారణ చేసి ఆయన ఒక ఇంజక్షను వేశాడు. తన ఇంజక్షను ప్రభావంవల్ల పదిగంటలకల్లా ఒళ్ళంతా చెమటలు పట్టి జ్వరం తగ్గిపోతుందన్నాడు.

తన మాటలోని నిజానిజాలను మాకళ్ల ఎదుట నిరూపించదలచినట్టుగా ఆయన మాతో బాతాఖానీ వేస్తూ అక్కడే కూర్చుండిపోయాడు.

"చాలా థేంక్సండీ డాక్టరుగారూ! పిలవగానే వచ్చేసే డాక్టర్లయితే వుంటారుగానీ, పేషంటుకు నయమయ్యేదాకా అక్కడే వుండిపోగల డాక్టర్లు చాలా అరుదు" అన్నాను.

"మరేం పర్వాలేదులెండి మూర్తిగారూ! నాకేమైనా పెళ్ళామా, బిడ్డలా! మిలిటరీ సర్వీసులో వుండిపోవడం మూలాన నేను సంసారం వూబిలో పడిపోలేదు. అవసరమైతే పేషంటును ఎంతసేపైనా కనిపెట్టుకొని వుండిపోగలను" నింపాదిగా అన్నాడు డాక్టరు సూర్యనారాయణ.

జ్వరం పూర్తిగా తగ్గిపోవడానికి వారం రోజులు పట్టింది. శరీరంలో మళ్ళీ మునుపటి ఉత్సాహం పుంజుకోడానికింకొక వారం రోజులు కావలసి వచ్చింది. డ్యూటీలో జాయినైన రోజున విమలాదేవిలో నవచైతన్యం కానవచ్చింది.

"జ్వరం వచ్చినా వచ్చిందిగానీ, వచ్చిన జ్వరం మీకు మేలే చేసినట్టుంది" అన్నాను.

ఆమె నవ్వింది.

ఆ నవ్వుకు అర్థమేమిటో నాకప్పుడు బోధపడలేదు.

ఆనాటి సాయంకాలం చిన్న అంతరంగిక సమావేశం ఒకటి జరిగింది.

"మూర్తిగారూ మనం పెద్దవాళ్ళమైపోయాం. కానీ చిన్న నాటి గుణాలు కొన్ని యింకా మనల్ని అంటిపెట్టుకునే వున్నాయి. నా చిన్నతనంలో నేను నాతోటి పిల్లల దగ్గర ఓ అందమైన వస్తువు కనిపిస్తే ఓర్చుకోలేకపోయేదాన్ని, మంచిగానో, చెడ్డగానో దాన్ని నా స్వంతం చేసుకోవాలనిపించేది. మనకు లేని అందమైన వస్తువు యింకొకరికుండగూడదు. మనకు దక్కని ఆనందం యింకొకరికి దక్కకూడదు, నాలోని ఈ అవగుణంవల్ల నేనెన్నోసార్లు మీ మనస్సుకు నొప్పి కలిగించి వుంటాను. అందుకు మీరు నన్ను మన్నించాలి..."

"ఎంతమాట! మిమ్మల్ని నేను మన్నించడమేమిటి?" అన్నాను.

"బహుశా మీకు జ్ఞాపకం వుండి వుంటుంది. పటం క్రిందపడి అద్దం పగిలిపోతే, నేను దాన్ని తీయించి లైబ్రరీలో బీరువాల వెనుక పెట్టించాను..."

"అవునవును. ఇప్పుడా ప్రసక్తి ఎందుకు?" అన్నాను.

"ఇప్పుడందుకు నేను దబ్బిస్తున్నాను, దయచేసి మీరు దానికి అద్దం వేయించి యథాస్థానంలో పెట్టించాలి..."

"అలాగే మేడమ్, అలాగే"

ఆ తరువాత నెలరోజులకు కన్యకాపరమేశ్వరి ఆలయంలో విమలాదేవి పెళ్ళి వైభవంగా జరిగింది. తన జీవిత కాలాన్ని పూర్తిగా ఒక పేషంటుపైన డివోట్ చేయడానికి డాక్టరు సూర్యనారాయణ అంగీకరించాడు. నూతన దంపతుల్ని గౌరవించడంకోసం మేము ప్రేయర్ హాల్లో విందు ఏర్పాటు చేసినప్పుడు పతిదేవుడి సరసన కొలువు దీర్చిన అలివేలు మంగమ్మ ముసిముసి నవ్వులు వెదజల్లింది.

♦ *'ఆంధ్రప్రదేశ్' మాసపత్రిక – 1971* ♦